

# అంతర్యం అట్టడుగున

జి. పరిమళా సోమేశ్వర్

మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ...ఎండకు భయపడి చెట్ల ఆకులు కూడా అల్లల్లాడటం మాని అణకువగా నిల్చిన సమయంలో...అప్పుడే ఆగిన సిటీ బస్సులోనుండి కంగారుగా, భయం భయంగా దిగింది రాధ.

బోటనీ లాబ్‌కి త్రోవ యెటో తెలియక కొంచెం సేపు చెట్లక్రిందనే నిలబడింది.

ఆమెతోపాటు అక్కడే దిగిన ఒక పెద్దమనిషి ఆమె తేరుకుని చూసేసరికి అప్పటికే ఏదో కొంపలు మునిగిపోతున్నట్లు పెద్ద పెద్ద అంగలు వేస్తూ రెండు ఫర్లాంగుల దూరం పోయేడు.

ఆయనతో పరుగు పందెం వేసే సాహసంలేక అక్కడనే నిలబడింది రాధ.

తీక్షణంగా వెలిగిపోతున్న సూర్యకాంతిలో యూనివర్సిటీ తాలూకు బిల్డింగులు, చెట్లు, దూరాన కనపడుతున్న కొండలు...అన్నీ ఎంతో గంభీరంగా కనపడుతున్నయ్. చుట్టుపక్కల పరిసరాలు నిర్మానుష్యంగా ఉండటంవల్ల వాటి గాంభీర్యం కొత్తవారిని మరింత భయపెడుతోంది. రెండు సంవత్సరాల పాటు ఆవాతావరణంలో చదివి ఎమ్మెస్సీ పట్టా పొందవలసి ఉన్నదన్న భావం రాగానే రాధ వళ్ళు జలదరించింది. సంతోషం భయం ముప్పిరికొనగా వచ్చిన పనికూడా మర్చిపోయి కాసేపు అలాగే నిల్చుండిపోయింది.

ఇంతలో తన సమీపంలో ఏదో అలికిడి అయినట్లయి తల త్రిప్పిచూసింది. రాధ. మొదటిచూపుతోనే ఉలిక్కిపడేట్లు చేసే నల్లని ఆకారం తనవైపుకే వస్తోంది. అందమైన వ్యక్తులేకాదు, అతి వికారమైన మనుషులు కూడా చప్పున కొత్తవారి దృష్టిని ఆకట్టుకుంటారు.

అందుకే రాధ ఓ పట్టాన అతని నుండి దృష్టి మరల్చుకోలేక అతని వికృతరూపాన్ని వింతగా చూస్తూ నిలబడింది. అతనిని చూడగానే రాధలో మొట్ట మొదటిగా ఏర్పడిన ఆలోచన "ఇంతటి వికృతమైన రూపంగల మనిషి అసలు ఎలా బ్రతుకుతున్నాడా?" అని.

కాలినకట్టె వంటి శరీరఛాయ, చిన్నగా, లోతుగా ఉన్న కళ్ళు, పెద్ద ముక్కు, రెండుపెదవుల మధ్యగా బయటకు పొడుచుకు వచ్చిన పళ్ళు, ఆ ఐదడుగుల ఆకారాన్ని చూస్తుంటే ఓ పక్క నవ్వు, మరోవంక జాలి, ఓ పక్క భయం, మరోవంక జుగుప్స...అన్నీ కలిగినయ్ రాధకి.

రాధ దృష్టిలో ఒక మనిషియొక్క సైకాలజీ చాలావరకు అతని రూపురేఖల బట్టే ఉంటుంది. అంతేకాదు. అసలు మనిషి సైకాలజీనిబట్టే అతని ముఖం కూడా ఉంటుందని ఆమె అభిప్రాయం.

కళ్ళకాంతిలో, పెదవుల వొంపులో, నుదుటి రేఖలలో ఆయావ్యక్తుల మనో

భావాలు చాలావరకు ప్రస్ఫుటమవుతా యని ఆమె నమ్మకం.

ఈ నమ్మకానికితోడు మనుష్యుల అంతర్యాలను ఒక్కచూపుతోనే చాలా వరకు అర్థం చేసికోగలనన్న నమ్మకం రాధకి బాగాఉంది. కొత్త వాళ్లెవరయినా తటస్థ పడినపుడు కొద్ది క్షణాలు వారి ముఖభావాలను, మాట్లాడే తీరునుబట్టి ఆ మనిషి మనస్తత్వం, వ్యక్తిత్వం ఎలాటివో కనీసం కొంతవరకైనా ఊహించి చెప్పవచ్చునంటుంది రాధ.

అందుకే ప్రథమ పరిచయంలోనే ఒక రకం వ్యక్తులను గురించి ఉన్నతంగా ఆలోచించటం, ఒకరకం వ్యక్తులను గురించి అల్పంగా భావించటం ఆమె కలవాటైపోయింది.

ఆమె అంచనాప్రకారం ఆమెకిప్పుడు ఎదురుగా ఉన్నవ్యక్తి రెండవ రకం జాబితాలోకి వస్తాడు.

అందువల్ల అతనిని బోటనీలాబ్‌కి త్రోవచూపించమనటానికి మనస్కరించ లేదు. కాని మరోవంక యితనుకూడా వెళ్లిపోతే తన సంగతి యేంకాను? చుట్టు పక్కల నరసంచారం కూడా లేదుకదా అన్న దిగులు ...

ఏదో అడగబోతున్నట్లు, అడగలేక అవస్థపడుతున్నట్లు ఉన్న రాధ ముఖం చూసి "మీరు ఎక్కడికి వెళ్ళాలి మిస్?" అని అతి మర్యాదగా యింగ్లీషులో ప్రశ్నించేడు. "బోటనీ డిపార్టుమెంటుకు త్రోవయేటో దయచేసి చూపిస్తారా?" తడబడుతూ ప్రశ్నించింది రాధ.

"రండి చూపిస్తాను. నేను కూడా అక్కడికే వెళ్ళాలి" అంటూ అతను కదిలేసరికి రాధ అతని ననుసరించింది.

ఆ త్రోవలో అక్కడక్కడా ఏ ఒకటో రెండో చెట్లు రోడ్డుకు కొద్ది గజాల దూరంలో ఉన్నయ్. రోడ్డు మీదకు చెట్లనీడ వచ్చే అవకాశం లేదు.

మిట్ట మధ్యాహ్నపు సూర్యకాంతికి ఆమె నెత్తిమాడిపోతోంది. ముఖం ఎర్రగా కందగడ్డలా తయారయింది. పది పదిహేను గజాలు నడిచిన తరవాత ముందు నడుస్తున్న అతను వెనక్కు తిరిగి ఆమెవంక చూసేడు. "పాపం. ఇప్పటికే మీ ముఖం వడలిపోయింది. ఇంకా మూడు ఫర్లాంగులవరకు యిలాగే ఎండలో నడచి వెళ్ళాలి" అన్నాడు సానుభూతిగా.

రాధ ఏదో అవసరంకొద్దీ అతని వెంట నడచివెళ్తోందే కాని అతని ముఖం లోకి చూడటం యిష్టంలేదు. అందుచేత అతనన్న మాటలకు సమాధానంగా 'ఉఁ' అని మూలుగులాటి శబ్దంచేసి ముఖాన్ని మరోవంకకు తిప్పుకుంది.

"మీరు ఏం చదువుతున్నారు?"

ఈసారి వెనక్కి తిరిగి చూడకుండా నడుస్తూనే అడిగేడు.

"ఈ రోజే ఎమ్మెస్సీ బోటనీ ... ప్రీవియస్‌లో చేరుతున్నాను." చెమటతో తడిసి వీపు కతుక్కుపోయిన అతని షర్టు వంకచూస్తూ సమాధాన మిచ్చింది రాధ. చటుక్కున వెనుదిరిగి చూసేడతను. "నిజంగానా? చాలా సంతోషం. నేను బోటనీ ఫైనలియర్‌లో ఉన్నాను. నా పేరు బాపినీడు." ఎంతో ఉత్సాహంగా తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"అలాగా!" అంది రాధ ఏమాత్రం ఆసక్తి కనపరచకుండా.

అంత అందవికారంగా ఉండి చూడగానే "ఏమంత మంచివాడు కాడు" అన్న అభిప్రాయాన్ని కలిగించే ముఖం గల అతని వెంట తను నడుస్తుంటే తను అతని తాలూకు మనిషని చూసిన వాళ్ళెక్కడ అనుకుంటారోనని అవమానంగా, సిగ్గుగా ఉంది రాధకి.

అందుకే సాధ్యమైనంతవరకు తమ యిద్దరి మధ్య దూరం ఎక్కువగా ఉండేందుకు ప్రయత్నిస్తూ మెల్లిగా నడుస్తోంది రాధ.

అలా పరధ్యాన్నంగా నడుస్తుంటే ఉన్నట్టుండి కాలికి రాయితగిలి చిటికినవేలు రక్తంచిమ్మింది.

"అమ్మో!" అని ఒక్క గావుకేక వేసి, వంగుని కాలుపట్టుకుంది.

ఆ కేకవిని రెండు గజాల ముందు నడుస్తున్న బాపినీడు "ఏమయింది మిస్?" అంటూ ఆమెతోపాటు వంగుని ఆమెకాలు పట్టుకోబోయేడు.

"ఆగండి ... నాకేం కాలేదు." మెరుపులా చటుక్కున లేచినిలబడి గట్టిగా అరచింది రాధ.

అతను తన పాదాన్ని ముట్టుకోబోతున్నాడన్న ఆలోచనకి ఆమె శరీరం జుగుప్సతో, సిగ్గుతో కుంచించుకు పోయింది.

అంతటి ఆవేశంలోనూ ఆమె మెదడుకు రెండు విషయాలు స్పష్టంగా తెలిసినయ్. తను వంగున్నపుడు తన పమిట జారిపోవటం అతను గమనించేడనీ, అతనిని వారిస్తూ అరడినపుడు ఆమె కళ్ళలో లిప్తపాటు వెలిగిన జుగుప్స, నిరసన, ఆజ్ఞ అతను గమనించి మ్లానవదనంతో లేచి వెనుదిరిగేడనీను.

ఆ తరువాత త్రోవలో యిద్దరి మధ్యా మాటలు లేవు. రాధ మనసంతా అల్లకల్లోలంగా ఉంది.

బాపినీడు మీద ఎందుకో అసహ్యంగా, కసిగా ఉంది. అతనివంటి నీచుడి సమక్షంలో పమిట జార్చిన తన నిస్సహాయతకి, తెలివితక్కువతనానికి తనని తానే తిట్టుకుంది.

బోటనీ డిపార్టుమెంటు దగ్గరకు వచ్చేక అతను ఆగేడు.

ఆమెవంక చూడకుండా చేతి వాచీ వంక చూసుకుంటూ "ఇదే బోటనీ డిపార్టుమెంటు. లోపలికి వెళ్ళండి.



లాబ్‌లో స్టూడెంట్సు ఉంటారు. నాకు వేరే పని ఉంది వస్తాను" అని ఆమె చెప్పబోయే 'థ్యాంక్సు'ని కూడా అందు కోకుండా వడివడిగా అడుగులువేస్తూ వెళ్ళిపోయేడు బాపినీడు.

అతనంత త్వరగా వదులుతాడని ఊహించని రాధ అతను వెళ్ళిపోగానే "పీడ వదిలింది అనుకుంది" కసిగా.

ఆ తరువాత నెలరోజులవరకు ఆ సంఘటన తలచుకున్నప్పుడల్లా తన కేదో పెద్ద అవమానం జరిగినట్లు భావించి కించపడేది రాధ.

క్రమంగా ఆ సంఘటనను మరిచి పోయినా బాపినీడుని మాత్రం మర్చి పోవటానికి వీల్లేకపోయింది.

బోటనీ ప్రీవియస్, ఫైనలియర్ విద్యార్థుల లాబొరేటరీలు పక్కపక్కనే ఉండటంవల్ల రోజూ యూనివర్సిటీలో ఉన్నంతసేపులో కనీసం నాలుగైదు సార్లయినా తప్పని సరిగా అతనిని చూడవలసి వచ్చేది.

అతను అల్లంత దూరంలో కనపడ గానే చటుక్కున ముఖం పక్కకు తిప్పు కునేది రాధ.

అప్పుడప్పుడు ఫైనలియర్ స్టూడెంట్సు ప్రీవియస్ స్టూడెంట్సు దగ్గ రకు వచ్చి, వాళ్ళకు తెలియని విష యాలు కొన్ని చెప్పటం, ప్రాక్టికల్సులో సహాయం చెయ్యటం జరుగుతుండేది.

అలాటి సమయాల్లో బాపినీడు తప్ప మరే యితర విద్యార్థి దగ్గరికైనా వెళ్తుం డేది రాధ.

అలా ప్రథమ వీక్షణంతోనే బాపినీడు మీద ఆమె ఏర్పరచుకున్న అకారణ ద్వేషాన్ని బలపరుస్తూ ఒక సంఘటన జరిగింది.

ఆ రోజు ఆమె క్లాస్‌మేటు సునంద క్లాసుకు ఏడుస్తూ వచ్చింది.

అతిగా ఏడవటంవల్ల ఆమె ముఖం మీది "మేకప్" అంతా చెల్లాచెదరై పోయింది. బుగ్గల గులాబీ రంగు, పౌడరు అన్నీ కరగిపోయి, కన్నీటి చారికలు ఏర్పడి, ఆమె సహజ వర్ణాన్ని బయటకు చూపుతున్నయ్. అందంగా గీసిన కాటుకరేఖలు చెదరి కళ్ళపక్కన నల్లని మచ్చల్లా ఏర్పడినయ్. ఎండిన ఆమె పెదవులమీది లిప్‌స్టిక్ పగుళ్ళు బారింది.

ఆమెకాక రాధతో కలిపి ముగ్గురు ఆడపిల్లలున్నారు ఆ క్లాసులో. వాళ్ళు ముగ్గురూ "ఏం జరిగింది?" అంటూ ఆత్రంగా అడిగేరు.

వెక్కిళ్ళ మధ్య సునంద "వాడు... ఆ స్కౌండ్రల్ ... ఆ వెధవ ... ఆలం...కొ..." క్రోధంతో, దుఃఖంతో సభ్యతను కూడా మరచి తిట్లు వదల సాగింది సునంద.

"ఎవరు ?" ఆత్రంగా మరింత దగ్గ రకు జరిగింది చంచల.

"ఇంకెవరు ? ఆ చచ్చినాడే ... బాపినీడు" అంటూ భోరున ఏడ్చింది సునంద.

"బాపినీడా ? ఏం చేసేదేమిటి ? కుతూహలాన్ని ఆపుకోలేకపోయింది కోమలి.

"నేను వస్తుంటే ... వస్తుంటే ... చెయ్యిపట్టుకుని లాగేడు, అది చూసి ... అక్కడున్న రౌడీ వెధవలంతా నవ్వేరు" వెక్కివెక్కి ఏడవసాగింది సునంద.

"చెప్పు తీసుకుని కొట్టకపోయేవా ?"

"వాడితో విరోధం పెట్టుకోవటం పాముతో చెలగాటమాడినట్లే. ఇదివర కొకసారి ఒక బీయస్సీ అమ్మాయిని

ఏదో అన్నాడని చెంపదెబ్బవేసిందిట. ఆ కోపం మనసులో ఉంచుకుని ఓ సాయంత్రం ఆమెను వెంబడించి, ఒంటరిగా పట్టుకుని ... "చటుక్కున ఆపేసింది సునంద. "బాపినీడు అంత నీచుడా?" అనుకుంది రాధ.

అతనిమీద మొదట్నుండీ రాధకు సదభిప్రాయం లేనిమాట నిజమే! ఐనా అతని నీచబుద్ధిని గురించి అంత స్పష్టంగా, వివరంగా వినేసరికి రాధ ఆశ్చర్యపోయింది.

"వాడు వట్టి నీచుడేకాదు. పశువు. అంతటి దుర్మార్గులు ప్రపంచంలో ఏ నూటికో కోటికో ఒకరుంటారు. వాడికి పెళ్ళికూడా అయింది. ఇద్దరు పిల్లలున్నారు. పెళ్ళానికి విడాకులిచ్చి యిలా ఆచ్చోసిన ఆంబోతులా తిరుగుతున్నాడు. ఆడవాళ్ళను అవమానించటమంటే చచ్చే ఆనందం అతనికి" సునంద అంటోంది.

బాపినీడు ఎంతటి నీచుడో యితరుల నోటివెంబడి వింటుంటే చాలా సంతోషం కలిగింది రాధకి-ఎందుకంటె యిన్నాళ్లూ బాపినీడును ఆమె ఎంతగా ద్వేషించినప్పటికీ 'అకారణంగా ఒక అమాయకుడిని ద్వేషిస్తున్నానేమో' నన్న పశ్చాత్తాప భావంకూడా ఆమెలో ఏ మూలో ఉండేది.

ఇప్పుడతని చరిత్రవిన్నాక, తన ద్వేషం సమంజసమైనదేనని తెలిసేక ఆమె మనసు తేలికపడింది.

అప్పటినుండి బాపినీడు కనపడినప్పుడల్లా అతనిమీద తనకుగల విముఖత్వాన్ని, ద్వేషాన్ని రాధ తన ముఖభావాలద్వారా స్పష్టపరుస్తుండేది.

పొరపాటున యిద్దరికళ్ళూ కలవటం తటస్థిస్తే నే యీసడించుకుంటున్నట్లు ఓసారి చూసి ముఖం తిప్పేసుకునేది.

ఒకసారేదో అవసరంవుండి బాపినీడు "మిస్ రాధా!" అంటూ పలకరించబోయేడు.

అతనిమాట వినిపించుకోనట్లే ఓసారి అతనివంక కొరకొర చూసి, నిర్లక్ష్యంగాలాబ్‌లోకివెళ్ళిపోయింది రాధ.

అరగంట తరువాత ఆమె ఏదో పనుండి బయటకు వచ్చేసరికి అతనింకా అక్కడే చిన్నబోయినవదనంతో నిలబడివున్నాడు.

అతని ముఖంలోని ఆవేదనను గమనించి తృప్తిగా నవ్వుకుంది రాధ. "ఈ పశువుకి 'ఫీలింగ్సు' కూడానా? వీడికసలు బాధపడటమంటే యేమిటో తెలుసా? కొంపతీసి తనమీద ఎలా ప్రతీకారం తీర్చుకోవటమా అని ఆలోచించటం లేదుకదా?" - అలా రకరకాలుగా ఆలోచించసాగింది రాధ.

అలాగే బాపినీడును మనసారా ద్వేషిస్తూ ఎమ్మెస్సీ ప్రీవియస్ పూర్తి చేసింది రాధ.

ఫైనలియర్ విద్యార్థులకు, ప్రీవియస్ విద్యార్థులకు ఒకరోజు తేడాతో పరీక్షలు జరిగినయ్.

రాధ ఆఖరు పేపరువ్రాసి తప్పకుండా క్లాసువస్తుందన్న నమ్మకంతో ఉత్సాహంగా ఉంది. ఫైనలియర్ పరీక్షలు క్రితంరోజుతోనే అయిపోయినయ్.

పరీక్షలైనరోజున అందరితో నూ కులాసాగా మాట్లాడి రోజూకంటె గంట ఆలస్యంగా యింటికి బయలేరింది రాధ.

బోటనీ డిపార్టుమెంటుదాటి కొంత దూరం వచ్చేసరికి "రాధా! రాధా!" అన్న కంఠంవినపడి చటుక్కునఆగింది. ఆమెవెనుక కొద్ది గజాల దూరంలో బాపినీడు!

ఒక్కసారిగా ఆమెగుండె కంపించిపోయింది.

వెంటనే ధైర్యం కూడదీసుకుని కనుబొమలు ముడిచి "ఏమిటి" అనడిగింది గంభీరంగా.

మళ్ళీ తొమ్మిది నెలల తరువాత బాపినీడు ముఖంలోకి పరిశీలనగా చూసింది రాధ.

నల్లని బొమికలగూడు వంటి శరీరం, చిన్నకళ్ళు, వికృతమైన నోరు... ఎందుకో ఆ సమయంలో అతనిఅనాకారితనం చూస్తుంటే ఆమెకు 'జాలి' వంటి మెత్తనిభావం కదిలింది.

"రాధా! కాస్త ఓపికగా వింటానంటే నీతో కొంచెం మాట్లాడతాను. అలా చెట్టు నీడలోకి వెళ్దాం. వస్తావా?" అన్నాడు బాపినీడు.

అని ఆమె సమాధానంకోసం చూడకుండా రోడ్డుకి అరఫర్లాంగు దూరంలో ఉన్న చింతచెట్లవైపుకి నడిచేడు బాపినీడు.

ఆమె తప్పక తనవెంట వస్తుందనే నమ్మకం కాబోలు! చిత్రమేమంటే రాధకెందుకో ఆ సమయంలో బాపినీడుని చూస్తుంటే రోజూలా అసహ్యంకాని. భయంకాని వెయ్యలేదు. పైగా అతను ఏం చెప్తాడో విందామన్న కుతూహలం తీవ్రంగా తలెత్తింది.

అందుకే మారుమాట్లాడకుండా అతని వెంటనడచి వెళ్ళింది రాధ.

ఇద్దరూ చింతచెట్టు నీడన ఒకరికొకరు రెండుగజాల దూరంలో నిలబడ్డారు.

పరీక్షలయిపోయినాయన్న సంబరంలో విద్యార్థినీ విద్యార్థులంతా గుంపులుగా జేరి నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు. చురుకు చురుకుమని శరీరాన్ని తాకుతున్న సూర్యకిరణాలు వాళ్ళ ఉత్సాహానికి ఏమాత్రం భంగం కలిగిస్తున్నట్లులేదు.

"మనం మొదటిసారి కలుసుకుంది యించుమించు యిదే వేళలో కదూ? ఆరోజు కూడా ఎండ యింత తీవ్రంగానే ఉంది" అన్నాడు బాపినీడు రుమాలుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ.

తను మనసులో అనుకుంటున్న




విషయాన్నే అతను పైకనేసరికి ఉలిక్కిపడి అతనివంక చూసింది రాధ

ఆమె ఉలికిపాటును గమనించి చిన్నగా నవ్వేడు బాపినీడు.

"ఐతే ఆరోజుకీ యీరోజుకీ ఓ ముఖ్యమైన తేడా ఉంది తెలుసా? ఆరోజు మనిద్దరం మండుటెండలో నడుస్తూ మాట్లాడేం. ఈ రోజున చెట్టునీడన నిల్చున్నాం" అన్నాడు.

రాధ మాట్లాడలేదు.

బాపినీడు కూడా పెదవి కదల్చకుండా రోడ్డుమీది జనాన్ని చూస్తూ నిలబడ్డాడు నాలుగు నిమిషాలపాటు.

ఆ నాలుగు నిమిషాల్లోనూ తను చెప్పదల్చుకున్న విషయాన్ని ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నట్లు అతని ముఖంచూస్తే తెలిసిపోతూనేఉంది.

"రాధా, నేనంటే నీకు చాలా అసహ్యం కదూ?"

హఠాత్తుగా వచ్చిన ఆ ప్రశ్నకు బిత్తరపోయింది రాధ.

ఎంతటి దుర్మార్గుడైనా, అసహ్యించుకోదగ్గ మనిషైనా 'నేనంటే నీ కసహ్యం కదూ?' అంటే 'ఔనని' ఎవరు మాత్రం సమాధానం చెప్పగలరు?

బాపినీడు నిట్టూర్చి అన్నాడు. "నువ్విప్పుడు సూటిగాచెప్పలేకపోవచ్చు. కాని మనం కలుసుకున్న రోజునుండి యీ క్షణంవరకు నీ ప్రవర్తన ద్వారా నేనంటే నీకెంత అసహ్యమో స్పష్టంగా తెలియయబరుస్తూనే వున్నావు. ఐనా పిచ్చివెధవను. నేనేఉండబట్టక అడిగేను. ఏమీ అనుకోకు" అన్నాడు బాపినీడు.

రాధ యిబ్బందిగా కదిలింది.

"బహుశా నువ్వు నన్ను అసహ్యించుకున్నంతగా ప్రపంచంలో ఏ వ్యక్తినీ అసహ్యించుకుని ఉండవు. ఔనా రాధా?" అంటూ జాలిగా చూసేడు ఆమెవంక.

అతని కళ్ళల్లో నిలిచిన కన్నీటిని చూసి రాధమనసు కలుక్కుమంది.

అతనిని అసహ్యించుకోవటం ద్వారా తానొక పెద్దనేరాన్ని చేసేనేమోనను కున్నది రాధ.

"అందులో నీ తప్పేంలేదు రాధా? బాధపడకు. నేనెంతవాణ్ణో కాలేజీలోని విద్యార్థినీ విద్యార్థులంతా నీకు చెప్పే ఉంటారు. వాళ్లదృష్టిలో నేనొక తాగుబోతుని. పెళ్లాన్ని విడిచిపెట్టిన పరమ కిరాతకుణ్ణి. పరస్త్రీలను అవమానపరచే నీచుణ్ణి. వాళ్లన్నదాంట్లో కొంతవరకు నిజం లేకపోలేదు. కాని నన్నిలాతయారు చేసిన పరిస్థితులను గురించి, వ్యక్తులను గురించి ఎవ్వరి ఆలోచించరు. అదే నాబాధ. పైకి ఇంత వికృతంగా, కనపడే నా రూపంమాటున దాగిన నా ఆంతర్యపు లోతులలోకి చూడటానికి ఎవ్వరూ ప్రయత్నించరు. కనీసం నువ్వయినా నన్నర్థం చేసుకుంటావేమోనని నా ఆశ? రేపే నేను మా ఊరు వెళ్లిపోతున్నాను. మళ్లీ జీవితంలో నిన్ను కలుసుకుంటానో లేనో. అందుకే ఆఖరి రోజున నీతో అన్నివిషయాలూ మాట్లాడదామనుకుంటున్నాను" అంటూ ఆగాడు కొద్దిసేపు బాపినీడు.

అతనివంక నిర్నిమేషంగా చూస్తున్న రాధకు ఆసమయంలో అతని ముఖాన్ని ఆవరించిన కఠినరేఖలేవో విడిపోయి మృదువైన అతని ఆంతర్యాన్ని బహిర్గతం చేస్తున్నట్లనిపించింది.

మళ్లీ ప్రారంభించేడు బాపినీడు. "అందరూ భార్యని వదిలిపెట్టాడనేవాళ్లే కాని ఆమెనెందుకు వదిలిపెట్టానా అని ఒక్కరూ ఆలోచించరు. నా భార్య ఎంతటి నీచురాలో పెళ్ళయిన మూడేళ్ళకి గాని నాకు తెలిసిరాలేదు. అది పేరుకు మాత్రమే నాకు భార్య. కాస్త మనోచాంచల్యం ఉన్న ప్రతిమగవాడినీ వశపరచుకుని వాళ్ళతో ఆనందిస్తుండేది. పెళ్లికాక ముందుకూడా ఆమెకా పాడుబుద్ధులుండేవిట. మావాళ్ళకి ఆ సంగతి తెలియక కట్నానికి ఆశపడిఆసంబంధం చేసేరు. దాని వ్యవహారమంతా తెలుసుకున్నాక తిట్టి పుట్టింటికి పంపేను. మా ఆస్తిపాస్తులుచూసి పుట్టింటిలో ఉండటా

నికి భార్యగాని, ఆమె తల్లిదండ్రులుగాని ఒప్పుకోలేదు. దాంతో కోర్టుకెక్కి విడాకులిచ్చి ఆమెను వదిలించుకోవలసి వచ్చింది. అప్పటి నుండి ఆడవాళ్ళంటే నాలో అంతులేని అసహ్యం కలిగింది. వాళ్ళమీద ఏదో ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆవేశం ఏర్పడింది. అందరూ కాకపోయినా లోకంలో చాలామంది స్త్రీలకు శీలం అనేది ఉండదనీ, సమాజానికి వెరచి నీతిగా మసలుకునే చాలామంది ఆడవాళ్ళు తమహావభావాల ద్వారా పురుషులను రెచ్చగొట్టి మానసికంగా తృప్తిపడుతుంటారనీ అనిపించింది నాకు. నా ఆలోచనలకు తగ్గట్టు నాగరికత పేరిట యీనాటి అమ్మాయిలు అవలంబించే వస్త్రధారణ ఆటపాటలు నన్ను మరింత సినిక్‌గా తయారుచేసినయ్. వాళ్ళ మనసుల్లో ఏమీ కల్మషంలేకపోతే అంత అసభ్యంగా ఎందుకు దుస్తులు ధరిస్తారు?" అనుకునేవాడిని. పైకి మగవాళ్ళ పొడే గిట్టనట్లు పోజులు. లోలోపల ఆ మగవాళ్ళని వెర్రెత్తించాలన్న ఆరాటం ...అలాటి ఆలోచనలున్న వాళ్ళని నేను భావించిన స్త్రీలనే నేనెప్పుడూ అవమానపరచేవాడిని. కొన్ని సమయాల్లో వివేకాన్ని విస్మరించి అమానుషంగా కూడా ప్రవర్తించిన మాట నిజమే! కానిఒక్కటి మాత్రం నిజం. మంచివాళ్లజోలికి నేనెప్పుడూ పోను. మగవాళ్లని కవ్వించే పొగరుబోతు వగలాడులకు బుద్ధిచెప్పేనే తప్ప శీలవతులైన ఆడవాళ్ళ ఛాయలకు కూడా పోయేవాడినికాను.

"మొదటి సారిగా నిన్ను చూసిన క్షణంలోనే నువ్వంటే నాలో యేదో మెత్తని, చల్లనిభావం కలిగింది. పసిపాపలోని నైర్మల్యం, అమాయకత్వం ప్రస్ఫుటంగా కనబడుతున్న నీముఖం చూసేక స్త్రీని గురించి నాకున్న అభిప్రాయాలలో చాలా మార్పులు వచ్చినయ్. ఎన్నడూ ఏ స్త్రీని చూసినా కలగని వాత్సల్య భావమేదో నిన్ను చూసిన క్షణంలోనే నాలో ఏర్పడింది. నిన్ను చూసిన కళ్లతో ప్రపంచాన్ని చూస్తే అది ఎంతో పవిత్రంగా మనోహరంగా కనిపించింది.

"ఆరోజు...కాలికిదెబ్బతగిలి... నీ పమిట జారిపోయినప్పుడు...నాలో ... యింతటి నీచుడు. పతితుడు అయిన నాలో...ఎలాటి వికారమూ కలగలేదు సరికదా "పిచ్చితల్లీ! ఎందుకమ్మా నీ అన్నను చూసి అంతగా బెదిరిపోతావు?" అని బుజ్జగించి చెప్పాలని పించింది.

"వాత్సల్యంగా నీ పాదానికి తగిలిన దెబ్బను చూడబోయిన నావంక నువ్వు చూసిన చూపు యీనాటికీ నాగుండెను దహించి వేస్తోంది. ఆక్షణంలో నీకళ్ళలో కనపడిన జుగుప్స నిరసన భావంచూసి ఎంత క్రుంగిపోయానో తెలుసా?"రాధా! నా చెల్లీ! నన్నపార్థం చేసుకోకమ్మా! నావంక అంతనిర్దాక్షిణ్యంగా చూడకమ్మా!" అందామని పించింది. ఒకసారి లాబ్‌లో నిన్ను పలకరించబోతే నువ్వు నన్ను అసహ్యించు కున్నట్లు ముఖం పెట్టి వెళ్ళిపోయేవు. ఆనాడు నేనుపడిన బాధను మాటలతో వర్ణించలేను. ఈ తొమ్మిది నెలలుగానూ నేను నీదగ్గరకు రావటానికి ప్రయత్నిస్తున్నప్పటికీనువ్వు మాత్రం నా నీడకూడా సోకనంత దూరంగా పోతున్నావు. మంచివాళ్ళ చేత "ఛీ" అనిపించుకున్నప్పుడు గాని మనలోని మాలిన్యం ఎంత పెద్దదో తెలిసిరాదు. నీ ప్రవర్తన నాలో పశ్చాత్తాపాన్ని కలిగించటమే కాదు...ఒక మంచిమనిషిగా నీ చేత గుర్తింప బడాలన్న కోరికను కూడా నాలో రేకెత్తించింది. ఈ లోకమంతా నాగురించి ఏమనుకున్నా ఫరవాలేదు. వాళ్లనన్నెంత అసహ్యించుకున్నా భరించగలను. నువ్వు నన్ను ద్వేషిస్తే మాత్రం నేను సహించలేను రాధా! అమ్మా! రాధా! ఒక్కసారి... ఒక్కసారి యీ అన్నయ్యని క్షమించేనని, యీ అన్నయ్యనుద్వేషించననీ మాట యివ్వమ్మా..." అంటూంటే దుఃఖంతో అతని కంఠం పూడుకుపోయింది.

రాధకి ఏదోమైకం వదిలినట్లనిపించింది. అకారణ ద్వేషంతో ప్రెజుడిస్‌తో కేవలం బాహ్యవర్తన నాధారంగా చేసుకుని ఒక వ్యక్తిని అసహ్యించుకుని బాధపెట్టింది యిన్నాళ్లూ. మబ్బులను చీల్చుకు వచ్చినసూర్యుడిలా తనలోని భయాందోళనలు, అనుమానాలు, అపోహలను చెల్లాచెదరు చేస్తూ నిలబడిన సూర్యకాంతి వంటి ఒక నిజం తాలూకు వెలుగులో పైకి వికృతంగా కనిపించే అతని ఆంతర్యపు అట్టడుగునగల మృదువైన అందమైన భాగం మెరిసిపోతుంటే వింతగా చూస్తూ నిలబడింది రాధ.